క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి చేయూత



మృతుడు లోకేష్ కుటుంబానికి నగదు అందజేస్తున్న లోకేష్ బాల్యమిత్రులు

లక్కవరపుకోట: అరకు–విశాఖ రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతారాం పురం గ్రామానికి చెందిన తూర్పాటి లోకేష్ మృతి చెందాడు. ఆయన భార్య ఉమ ఇద్దరు ఆడపిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మృతుడు లోకేష్‌తో కలిసి 2006లో పదోతరగతి చదువుకున్న మిత్రులకు ఈ విషయం తెలియడంతో స్పందించారు. అంతా కలిసి రూ.53,500 నగదును తమ మిత్రుడి భార్య ఉమకు శనివారం అందజేశారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లీప్ యాప్‌లో హాజరు నమోదు చేయాలి

వేపాడ: పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును లీప్ యాప్‌లో సకాలంలో నమోదు చేయాలని ఎంఈఓ బాల భాస్కరరావు సూచించారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు.గణితంలో పదోతరగతి విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనం తరం ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశమయ్యారు.ఉపాధ్యాయులు సెలవు పెడితే యాప్‌లో నమోదుచేయాలని సూచించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు కిరణ్మయి, జయశ్రీ ఉన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయండి



మీడియాతో మాట్లాడుతున్న దళిత నేతలు

శృంగవరపుకోట: ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్ నిధులను తక్షణం విడుదల చేయాలని దళిత ఉద్యమ నేత భాస్కర్ డిమాండ్ చేశారు. ఎస్.కోటలో శనివారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటోందన్నారు. సబ్‌ప్లాన్ నిధులను ఇతర పథకాలకు మళ్లించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు.అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ప్రతినిధు లు పి.సూరిదేముడు, డోల కేశవ, గుర్రపు శ్రీను, బోనెల ఈశ్వరరావు, తెరపల్లి సూరిబాబు, ఎస్.కృష్ణ, ఎద్దు సూర్యారావు, డెంకాడ సోమేష్,తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లోని పైపులైన్లను తొలగించాలి

వేపాడ: గ్రామాల్లో ఎక్కడైనా డ్రైనేజీల్లో తాగునీటి పైపులైన్లు ఉంటే తక్షణమే తొలగించాలని డీఎల్‌పీ శిరీషరాణి అధికారులకు సూచించారు. వేపాడ, వీలుపర్తి గ్రామపంచాయతీల్లో శనివారం ఆమె పర్యటించారు. గ్రామాల్లో వీధికాలువలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. వేపాడలో మురుగు కాలువల్లో ఉన్న తాగునీటి పైపు లైన్‌లను సిబ్బందితో బయటకు తీయించారు. ప్రజల సహకారంతో పంచాయతీల పాలకులు, సిబ్బంది సమన్వయంతో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలని సూచించారు. తాగు నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేసి, క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ రవికుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వేపాడ: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, ఉపాధ్యాయ బృందం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట మోడల్‌స్కూల్ పనిచేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు, సహోపాధ్యాయులు శనివారం సన్మానించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు బి.శారదమ్మ, ఎస్.కె. శ్రీనివాసరావు, ఎన్.మహేష్, ఎస్.గౌరు నాయుడు,జి.పుష్పవల్లికి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయుల సేవలను ప్రిన్సిపాల్ కొనియాడారు.

సచివాలయ సిబ్బందికి...



జామి: ఆర్.బి.పురంలో సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు

జామి: మండలంలోని ఆర్.బి.పురం సచివాలయంలో పనిచేసి వివిధ గ్రామాలకు బదిలీ అయిన నలుగురు సిబ్బందిని ఆ గ్రామపెద్దలు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు అయిన నాటి నుంచి సిబ్బంది తమ గ్రామంలో అంకిత భావంతో పని చేశారని, ఎక్కడికెళ్లినా ఇదే విధంగా పని చేసి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పత్రి అప్పారావు,పెద్దలు చిన సత్యం,వర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం..దగా

- 'బాబుష్యూరిటీ – మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్‌సీపీ నాయకులు



గంట్యాడ: వసంత గ్రామంలో కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరిస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్, తదితరులు

వేపాడ/దత్తిరాజేరు/జామి/గంట్యాడ / చీపురుపల్లిరూరల్(గరివిడి): చంద్రబాబు అంటేనే మోసం..దగా అని, ప్రజలను నమ్మించి గొంతు కోయడంతో సిద్ధ హస్తుడని గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. గంట్యాడ, వేపాడ, జామి,దత్తిరాజేరు, గరివిడి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల ఆధ్వర్యంలో శనివారం 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీల ను గుర్తు చేసి, వాటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్‌తో పాటు ఇతర ఎన్నికల హామీలను ఎప్పుడు అమలు చేస్తారని గ్రామాల్లోకి వచ్చే టీడీపీ కూటమి నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు.

- వేపాడ మండలంలోని దబ్బిరాజుపేట,చామలాపల్లి,కరకవలస, జాకేరు,గుడివాడ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, సర్పంచ్‌లు గొంప వేమననాయుడు, కోలా సతీష్, దండుపాటి ముత్యాలమ్మ,మిడతాన గోపి, ఎంపీటీసీలు చామంతుల లక్ష్మి, ఏ.సత్యనారాయణ పాల్గొన్నారు.
- దత్తిరాజేరు మండలంలోని విజయరాంపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, సర్పంచ్ గోర్లి సింహాచలం, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు,వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, మండల నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు,సుమల శ్రీను,మండల శ్రీను,సుమల గోవింద్,రెడ్డి సింహాచలం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- జామి మండలంలోని లొట్లపల్లి,రామయ్యపాలెం, భీమసింగి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ,వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొందంకి సంజీవి, పార్టీ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి ఫణిబాబు,వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు,తదితరులు పాల్గొన్నారు.
- గంట్యాడ మండలంలోని వసంత గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్,పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య,ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి జాగరపు సత్యారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కె.విజయ్, ఉపాధ్యక్షుడు పాటుపు రెడ్డి వెంకటరావుచ తదితరులు పాల్గొన్నారు.
- గరివిడి మండలంలోని నీలాద్రిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు వైస్ ఎంపీపీ జి.శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు,ఎంపీటీసీలు కదుమల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



జామి: భీమసింగిలో బాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): నీలాద్రిపురంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దత్తిరాజేరు: విజయరాంపురంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వేపాడ: చామలాపల్లిలో చంద్రబాబు మోసాలను మహిళకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు



అంబేడ్కర్ విగ్రహనికి కరపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సరయు, ఎంపీపీ అరుణ

జామి: ఎన్నికల హామీలు అమలు చేసేలా సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కాకుండా భారత రాజ్యాంగాన్ని అమలు చేసేలా చూడాలని కోరుతూ లొట్లపల్లిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ గొర్లె సరయు,ఎంపీపీ సబ్బవరపు అరుణ వినతిపత్రంతో పాటు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కరపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



తల్లులతో సమావేశమైన సూపర్‌వైజర్ హైమావతి

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ మల్లివీడు సెక్టార్ సూపర్ వైజర్ కె.హైమావతి సందర్శించారు. గేదెలవానిపాలెంతో పాటు మండలంలోని పలుగ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలకు రాకపోతుండడంతో 'బోసిపోతున్న అంగన్‌వాడీ కేంద్రాలు' శీర్షికతో సాక్షి పత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. దీనికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఈమేరకు గేదెలవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమావతి సందర్శించడంతో పాటు గ్రామంలో పర్యటించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తల్లులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నామని అవగాహన కల్పించారు.

పరామర్శ



మన్మధరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

బొండపల్లి: మండలంలోని ముద్దూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాలి మన్మధరావు తల్లి ఇటీవల మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య శనివారం ముద్దూరు వెళ్లి మన్మధరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గొట్లాం మాజీ సర్పంచ్ మీసాల తులసిరాం ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులనూ అప్పలనరసయ్య పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, నాయకులు మునకాల పైడిపునాయుడు, తాళ్లపూడి అప్పలనాయుడు, మహంతి రమణ, కరోతు శ్రీనివాస్, పల్లి రఘు, సాలపు పెంటం నాయుడు ఉన్నారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి



ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

శృంగవరపుకోట: పట్టణంలోని వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈతరుణంలో పట్టణ పోలీసులు పర్మిషన్లు లేవంటూ ర్యాలీని ఆపేప్రయత్నం చేసినా విద్యార్థులు గట్టిగా ప్రతిఘటించటంతో పోలీసులు మిన్నకున్నారు. అనంతరం విద్యార్థులు హాస్టల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబాబు మాట్లాడుతూ ఎస్.కోట ఎస్టీ బాలుర వసతి గృహంలో అదనపు గదులు, అదనపు మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.ఎస్ఎఫ్ఐ నేతలు పి.రమేష్, భారతి, రత్న, అనిత, చరణ్, తిలక్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమర వీరులకు నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



శృంగవరపుకోట: మాజీ సైనికుడిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ నేతృత్వంలో కార్గిల్ విజయ్‌దివస్‌ను శనివారం నిర్వహించారు. కార్గిల్ పోరాటంలో దేశం కోసం అశువులు బాసిన అమరవీరులకు అధ్యాపకులు డాక్టర్ జి.ఈరన్న, విద్యార్థులు నివాళులర్పించారు.

బీజేపీ నేతృత్వంలో..

పట్టణంలోని ఓ ప్రైవేటుహాల్‌లో బీజేపీ నేతలు కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. భారత్ సైన్యంలో 7వ రెజిమెంట్‌లో ఎంఆర్‌సీగా పనిచేసి పదవీ విరమణ చేసిన మాజీ సైనికుడు శిరికి నగేష్‌ను సన్మానించారు.బీజేపీ నేతలు సీహెచ్.ఆర్.కె.ప్రసాద్, డి.సూర్యారావు, కె.లోకాభిరామకోటి, డి.దాశరథి, బొండపల్లి చంద్రశేఖర్, ఎం.జగన్నాథం, గణేష్ పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక సాయి సిద్ధార్థ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, ఆపార్టీ సీనియర్ నాయకుడు దొగ్గ దేవుడు బాబు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.భాస్కర్,ప్రధాన కార్యదర్శి కె.తవుడు,ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొత్తవలస: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ సూచించారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో వైద్యసిబ్బందితో కలిసి శనివారం ఆయన పర్యటించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు నివాసాల సమీపంలో చెత్త, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. జ్వరం ,విరోచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సీహెచ్ఓ అప్పలకొండ,ఈఓ సన్యాసినాయుడు,హెచ్ఓ బేబీరాణి,నిర్మల,హెచ్ఎస్ సూరిదేముడు పాల్గొన్నారు.

సర్వేయర్‌గా ఖాదర్



మెరకముడిదాం: మండల సర్వేయర్‌గా పి.ఖాదర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం సర్వే ఎ.డి కార్యాలయం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో మండలంలో ముగ్గురు సర్వేయర్లు మారారు. రెగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆటంకం కలిగిస్తే చర్యలు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా వ్యాపారాలు సాగిస్తున్న వారు వాహనదారులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎల్. దామోదరరావు అన్నారు. పట్టణంలోని విజయనగరం – రాజాం రోడ్‌తో పాటు చీపురుపల్లి – లావేరు రోడ్‌లో శనివారం సాయంత్రం దుకాణాల ముందున్న ఆక్రమణలు తొలగించారు.

శక్తి వారియర్‌గా నిలవాలి

గుర్ల: ప్రతి విద్యార్థినీ శక్తి వారియర్‌గా నిలవాలని ఎస్సై పి. నారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం..

చీపురుపల్లి: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని యూత్‌క్లబ్ బెజ్జిపురం ప్రతినిధులు అన్నారు. జూలై 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా జూలై 15 నుంచి 30 వరకు జరుగుతున్న అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జి.ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

50 కిలోల బస్తాకు రెండు కిలోలు తక్కువ..

మెరకముడిదాం: చీపురుపల్లిలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఇచ్చే రేషన్‌బియ్యంలో 50 కిలోల బస్తా తూకం వేస్తే కిలో నుంచి రెండు కిలోల వరకు తక్కువ వస్తోందని, ఈ వ్యవహారంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని మెరకముడిదాం మండలానికి చెందిన డీలర్లు కోరారు. ఈమేరకు శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సులోచనారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆమె స్పందిస్తూ ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులతో మాట్లాడతానని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో కెంగువ శ్రీనివాసరావు, సుంకరి జయసింహ, తదితరులు పాల్గొన్నారు.